సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



క్రీడాకారులకు అభినందనలు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. వీరిని ఆయా యాజమాన్యాలు అభినందించాయి. 8లో



రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి తరలిరావాలి 8లో

రాష్ట్ర రెవెన్యూ కౌన్సిల్ సమావేశానికి తరలిరావాలని జిల్లా అసోసియేషన్ కోరింది.



నీతిఅయోగ్‌కు మూడు మండలాలు

నీతి అయోగ్‌కు వై.రామవరం,మారేడుమిల్లి, గంగవరం మండలాలు ఎంపికైనట్టు స్త్రీశిశు సంక్షేమశాఖ కమిషనర్ జానకి తెలిపారు. 8లో

సీఎం జగన్‌ను కలిసిన గిరిజన ఎమ్మెల్యేలు



అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొరతో పాటు జిల్లాకు చెందిన పాడేరు, అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి కలిశారు.

– సాక్షి, పాడేరు

జగనన్నకు చెబుదాం సద్వినియోగం

- మారుమూల గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు
- 207 అర్జీల అందజేత
- సమస్యలు ఓపిగ్గా తెలుసుకున్న అధికారులు
- నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలు: కలెక్టర్ సుమిత్‌కుమార్



భారీగా తరలివచ్చిన ప్రజలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పెదబయలు: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు చేకూరింది. జిల్లా అధికార యంత్రాంగం ప్రజల చెంతకు వచ్చి ప్రజల సమస్యలు ఓపిగ్గా తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో గిరిజనుల్లో ఆనందం నెలకొంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజనుల నుంచి 207 వినతులు స్వీకరించారు. వీటిలో అధికశాతం రెవెన్యూ, పంచాయతీ రాజ్, రహదారులు, ఇళ్ల మంజూరుకు సంబంధించినవి ఉన్నట్టుగా అధికారవర్గాలు తెలిపాయి.

సేవలు మరింత చేరువ

ప్రజలకు సేవలు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల కేంద్రంలో నిర్వహించినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లా అధికారులు రావడంతో సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశతో ప్రజలు తరలివచ్చారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతీ సమస్య సావధానంగా విని పరిష్కరించే లక్ష్యంతో కృషి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తమ కుమారుడికి ఉద్యోగం ఉన్నందున తనకు పింఛను ఆగిపోయిందని, అయితే వేర్వేరుగా ఉన్నందున పింఛను పునరుద్ధరించాలని గోమంగి పంచాయతీ కరుగొండ గ్రామానికి చెందిన గడుతూరి దమయంతి వినతిపత్రం ఇచ్చింది.
- 2015 నుంచి 2021 వరకు వెలుగు కార్యాలయంలో పనిచేసిన తాను గర్భవతిగా ఉన్న సమయంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించారన్నారు. ఉద్యోగం ఇవ్వాలని ఆమె అర్జీ అందజేసింది.
- చెక్‌డ్యామ్ నిర్మించాలని సీకరి గ్రామస్తులు అర్జీ సమర్పించారు.
- వై.పేడాపల్లి నుంచి ఉక్కుర్బ వరకు పది కిలోమీటర్ల మేర తారురోడ్డు నిరించాలని, పాడేరు నుంచి కుమడ వరకు నడుస్తున్న బస్సును జామిగుడ వరకు పొడిగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.
- మండల కేంద్రమైన పెదబయలులో బస్ స్టేషన్‌ను వినియోగంలోని తీసుకురావాలని సీతగుంట పంచాయతీ లకేయిపుట్టు గ్రామానికి చెందిన కిముడు సత్తిబాబు, బొండా రాజారావు కోరారు.
- జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉన్నందున కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ను నియమించాలని బొంగరం పంచాయతీ చిట్రకాయపుట్టు, కొండ మామిడి, రాళ్లగొంది, పోతులగరువు గ్రామస్తులు అర్జీ సమర్పించారు.

ఎంతో సౌలభ్యం



ప్రజలకు చేరువలో జగనన్నకు చెబుదాం నిర్వహించడం ఎంతో సౌలభ్యంగా ఉంది. జామిగుడ పంచాయతీకి చెందిన సమస్యలు పరిష్కరించాలని, తారురోడ్డు సౌకర్యం ఉన్నందున బస్సు సదుపాయం కల్పించాలి. అంతేకాకుండా జామిగుడ గెడ్డపై వంతెన మంజూరైనందున పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశా. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ చెప్పారు.

– జర్సింగి గంగాభవాని,
మాజీ జెడ్పీటీసీ, పెదబయలు

ఉద్యోగం కోసం విన్నవించా



బీఏ బీఈడీ చదువుకున్నందున ఏదైనా పాఠశాలలో సీఆర్టీ ఉద్యోగ అవకాశం కలిపించాలని అర్జీ అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా మండల కేంద్రాల్లో స్పందన నిర్వహించడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. ప్రజల చెంతకు వచ్చిన అధికారులు తమ సమస్యను ఎంతో ఓపిగ్గా ఉన్నారు. సమస్యలు పరిష్కారమవుతుందన్న నమ్మకం ఏర్పడింది.

– కొర్ర అనూష,
కప్పాడ, పెదబయలు మండలం

లంబసింగికి ప్రపంచస్థాయి గుర్తింపు

ఏపీ టూరిజం ఎస్టేట్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్ష



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగికి ప్రపంచ స్థాయి గుర్తింపు రావాలని ఏపీ టూరిజం ఎస్టేట్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని లంబసింగిలోని ఏపీ టూరిజం రిసార్ట్స్‌లో వేడుకలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగిని ప్రపంచ స్థాయిలో ఆదరణ లభించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు కనీసం రెండు మూడు రోజులు ఉండేలా చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో పర్యాటక ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లంబసింగి ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి రూ.50 కోట్లతో డీఆర్‌పీలు సిద్ధం చేశామన్నారు. టూరిజం డివిజన్ మేనేజర్ హరిత, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి. దాసు, లంబసింగిమేనేజర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.



థింసా నృత్యం చేస్తున్న గిరిజన విద్యార్థులు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



హాజరైన అభ్యర్థులు

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో పలు చోట్ల ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆయాల పోస్టుల భర్తీకి బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఖాళీగా ఉన్న 30 పోస్టులకు గాను 106 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఏడు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 99 దరఖాస్తులకు సంబంధించిన అభ్యర్థులకు ఐటీడీఏ పీవో, ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వి.అభిషేక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎటువంటి విమర్శలకు తావునీయకుండా పారదర్శకంగా నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలు అందజేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అనంతగిరిలో జగనన్నకు చెబుదాం రేపు

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29న జగనన్న చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కుమార్ తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. మండల ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటారని ఆయన సూచించారు.

పీఎఫ్ అదాలత్‌లో 45 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న విశాఖ రీజనల్ నోడల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణమోహన్

పాడేరు రూరల్ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎఫ్ అదాలత్‌ను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ రీజనల్ నోడల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేవీ కృష్ణమోహన్ కోరారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన పీఎఫ్ అదాలత్‌లో 45 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ పి. కామేశ్వరరావు, ఎ.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో భారీ వర్షం



మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో గెడ్డలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గ్రామాల్లో రోడ్లు, వీధులు, పంట పొలాలు జలమయమయ్యాయి.పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి, మద్దిగరువు, కిల్లంకోట, వంజరి– తాజంగి, సొలభం, గడుతూరు రోడ్డు మార్గాల్లో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎంబీఆర్ కాంప్లెక్స్ వద్ద రోడ్డు పక్కన డ్రైనేజీ మూసుకు పోవడంతో వర్షం నీరంతా రోడ్డుపైకి వచ్చేసింది.

గల్లంతైన రైతు మృతదేహం లభ్యం



వాగులో లభ్యమైన రైతు మృతదేహం

ఎటపాక: మండలంలోని తోటపల్లి వాగులో సోమవారం గల్లంతైన రైతు మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది.గన్నవరం గ్రామానికి చెందిన కరి సత్యనారాయణ(65) పశువులను మేపేందుకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వాగును దాటుతూ మునిగి పోయాడు.మంగళవారం గాలించినప్పటికీ అతడి ఆచూకీ దొరకలేదు.అయితే వాగు దాటిన ప్రదేశంలోనే బుధవారం ఉదయం అతని మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రూ.69.87 లక్షల నిధులు దుర్వినియోగం

- రంపచోడవరం పంచాయతీలో స్వాహా చేసిన గత కార్యదర్శి
- వివరాలు వెల్లడించిన డీఎల్పీవో రాఘవన్



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్పీవో రాఘవన్

రంపచోడవరం: రంపచోడవరం గ్రామ పంచాయతీలో పనిచేసిన గత కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణమూర్తి రూ.69,87,085ను స్వాహా చేసినట్టు గుర్తించామని డీఎల్పీవో రాఘవన్ బుధవారం తెలిపారు. గత వారం రోజులుగా రికార్డులను పరిశీలించి పక్కదారి పట్టిన నిధుల వివరాలను సేకరించామని ఆయన పేర్కొన్నారు. పన్నులు, ఇతర మొత్తాలకు సంబంధించి రూ. 47,25,576, 2020–21లో భవన నిర్మాణాల అనుమతి నిమిత్తం వసూలు చేసినవి రూ.4,98,359, 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.11.72 లక్షలు, పంచాయతీ సాధారణ నిధులు రూ.5,91,150 మొత్తాన్ని స్వాహా చేసినట్టు గుర్తించామని తెలిపారు. ఇవి కాకుండా 2018కు ముందు సీఎఫ్‌ఎంఎస్ లేనందున వోచర్లు పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ మొత్తం వివరాల ఆధారంగా ఏమేర నిధులు స్వాహా చేశారనేది ఒక కొలిక్కి వస్తుందన్నారు. దీని ఆధారంగా నివేదిక సిద్ధం చేస్తామని డీఎల్పీవో వెల్లడించారు. స్వాహా చేసిన మొత్తంలో ఇప్పటివరకు గత కార్యదర్శి సత్యనారాయణమూర్తి రూ. 37.90 లక్షలు పంచాయతీకి జమ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. నిధులు దుర్వినియోగంలో ఎవరి ప్రమేయమైనా ఉంటే వారిపై కూడా చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

ముగిసిన మావోయిస్టు పార్టీ వార్షిక వారోత్సవాలు



జీకేవీధి మండలం మారుమూల ప్రాంతాలకు వెళ్లే మార్గంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

సాక్షి,పాడేరు: మావోయిస్టు పార్టీ 19వ వార్షికోత్సవ వారోత్సవాలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో జిల్లా పోలీసు యంత్రాంగం రెడ్ అలర్ట్ అమలుజేసింది. మావోయిస్టుల కార్యకలపాలను నిరోధించే లక్ష్యంతో పాటు మావోయిస్టు పార్టీ వారోత్సవాలను భగ్నం చేసేందుకు పోలీసుశాఖ భారీగానే కూంబింగ్ చేపట్టింది. ఏవోబీతో పాటు తెలంగాణలోని చర్ల, ఛత్తీస్‌గఢ్‌లోని శబరి వంటి అటవీ ప్రాంతాల వరకు పోలీసు బలగాలు జల్లెడ పట్టాయి. అలాగే మావోయిస్టుల కదలికలపై డ్రోన్ కెమెరాలతోను నిఘా అమలుజేశారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో బాంబు స్క్వాడ్‌లతో ప్రధాన రోడ్లు, ప్రధాన కూడళ్లను తనిఖీ చేశారు. జిల్లాలోని పాడేరు,రంపచోడవరం,చింతపల్లి,చింతూరు పోలీసు సబ్‌డివిజన్ ఏఎస్పీలు,ఇతర అధికారులతో ఎప్పటికప్పుడు భద్రత చర్యలపై ఎస్పీ తుహిన్‌సిన్హా సమీక్షించారు.మావోయిస్టుల వారోత్సవాలతో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ వ్యూహాత్మకంగానే వ్యవహరించింది.పోలీసు బలగాల గాలింపు చర్యలతో మావోయిస్టుల వారోత్సవాల జాడ కానరాలేదు.

గిరిజన వైద్య విద్యార్థికి ఐటీడీఏ ఆర్థికసాయం

- ఇషాక్‌కు మొదటి సంవత్సరం ఫీజు కేటాయింపు
- రూ.1,65,500 చెల్లించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



ఇషాక్‌ను సత్కరిస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘ సభ్యులు

మధురవాడ (విశాఖ): వైద్య విద్యార్థి కె.ఇషాక్‌కు మొదటి సంవత్సరం ఫీజు రూ.1,65,500ను అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్ అందజేశారు. చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ ఈదులబయలు గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి ఇషాక్ మధురవాడలోని మారికవలస ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల సంస్థలో శిక్షణ పొందాడు. నీట్–2023 పరీక్షల్లో 420 మార్కులు సాధించి, ఆలిండియా స్థాయి ఎస్టీ కేటగిరీలో 3073 ర్యాంకు సాధించాడు. విశాఖలో ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాలలో సీటు వచ్చింది. అతని వైద్య విద్యకు సంబంధించి మొదటి సంవత్సరం ఫీజును కలెక్టర్ సుమిత్‌కుమార్ అందజేయడంతో ఆర్థికభారం తప్పిందని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ ఎల్. శివప్రసాద్ తెలిపారు.

వైద్య విద్యార్థికి సత్కారం

చింతపల్లి రూరల్: గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సర్పీపట్నం గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సమరెడ్డి ధనార్జన్ అన్నారు. బుధవారం లంబసింగిలో వైద్య విద్యార్థి కొర్ర ఇషాక్‌ను ఉద్యోగుల సంఘ నేతలు సత్కరించారు. అతని చదువుకు సంబంధించి ఉపాధ్యాయులు జె.గిరిబాబు,ఆయన సతీమణి ఎఫ్‌ఎస్‌వో భాగ్య సహచర గిరిజన ఉద్యోగుల నుంచి సేకరించిన రూ.64 వేలు, హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు టి.మల్లేష్ రూ.10 వేలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వచ్చే ఏడాది నుంచి వైద్య విద్య తరగతులు

- తోటి గిరిజనులకు సేవ చేసే అదృష్టం
- పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలత
- బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతను సత్కరిస్తున్న జిల్లా ఆస్పత్రి వైద్యనిపుణులు



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత

సాక్షి,పాడేరు: వచ్చే ఏడాది నుంచి పాడేరు వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయని ఆ కళాశాల తొలి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలత పేర్కొన్నారు.కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో గైనిక్ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం పాడేరులో అందుబాటులోకి రానున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై నియమించింది. ఈ మేరకు ఆమె బుధవారం పాడేరు జిల్లా బోధన ఆస్పత్రిలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు ఉన్నత వైద్యం, గిరి విద్యార్థుల వైద్య విద్యకు ప్రాధాన్యమిచ్చి ఇచ్చి వైద్య కళాశాలను మంజూరు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పాడేరులో పనిచేసే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రాంత ప్రజలకు వైద్య పరంగా సేవ చేయాలనే లక్ష్యంతోనే ఇక్కడికి వచ్చినట్టు ఆమె పేర్కొన్నారు. పాడేరు మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు అందుబాటులోకి వచ్చేంతవరకు జిల్లా బోధన ఆస్పత్రిలోనే అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు. వచ్చే ఏడాది నుంచి మెడికల్ కళాశాల తరగతులను ప్రారంభించే ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. పాడేరు జిల్లా బోధన ఆస్పత్రిలో ప్రస్తుతం అదనంగా వార్డు గదులు, మరో 130 పడకలు ఏర్పాటుతోపాటు పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే ఐదుగురు ప్రొఫెసర్లు విధుల్లో చేరారని వివరించారు. మిగిలిన వైద్యనిపుణులు బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించి నియామకాలు ప్రభుత్వం వేగవంతం చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆమెకు జిల్లా ఆస్పత్రిలోని ప్రొఫెసర్లు,ఇతర వైద్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ కె.కృష్ణారావు, ప్రొఫెసర్లు డాక్టర్ టి.విజయ కుమారి, డాక్టర్ టి.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ పందరీ బాబు, డాక్టర్ పి.ఎర్రయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రిన్సిపాల్

సాక్షి,పాడేరు: కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను బుధవారం సాయంత్రం పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలత మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా బోధన ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు.ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏపీఈఆర్సీ విచారణ

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ వినియోగదారుల అర్జీలపై విచారణ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) మూడు రోజుల పాటు పర్యటించనుంది. ఈ నెల 29, 30, అక్టోబర్ 1వ తేదీల్లో ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి.వెంకట్‌రామిరెడ్డి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించనున్నారు. ఇప్పటికే గృహ వినియోగదారులు, పరిశ్రమలు, వివిధ సంస్థల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై ఈ విచారణ జరగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఏపీఈఆర్సీ క్యాంపు కార్యాలయం విశాఖలోని ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన నేపథ్యంలో అక్కడి నుంచే కీలక హియరింగ్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.మాడుగుల: స్థానిక సబ్ స్టేషన్ నిర్వహణ పనులు నిమిత్తం ఈ నెల 29వ తేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పాడేరు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు. జి.మాడుగుల మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పకడ్బందీగా ఈ క్రాప్



డుంబ్రిగుడ మండలం అరమ గ్రామంలో ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

- ఇప్పటివరకు 67.58 శాతం నమోదు
- రెండు మూడు రోజుల్లో నూరుశాతం పూర్తి
- వేగవంతం చేసిన అధికారులు

సాక్షి,పాడేరు : ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈ క్రాప్ నమోదును జిల్లా వ్యవసాయశాఖ పక్కాగా, పకడ్బందీగా అమలు చేస్తోంది. గత 25 రోజులుగా నమోదు ప్రక్రియను అధికార యంత్రాంగం వేగవంతం చేయడంతో వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది నిమగ్నమయ్యాయి. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 2లక్షల96వేల260.24 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. చింతూరు డివిజన్‌లోని ముంపు గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు తలెత్తాయి. మిగిలిన అన్నిచోట్ల ఖరీఫ్ వ్యవసాయ పనులు ఆశాజనకంగానే ఉన్నాయి. వరి, ఇతర చిరుధాన్యాల పంటలకు సంబంధించి లక్షా83వేల769.24 ఎకరాలు, ఉద్యానవన పంటలు లక్షా12వేల491 ఎకరాల్లో సాగవుతున్నాయి. వీటిలో ఇప్పటివరకు 2లక్షల 225.75 ఎకరాలకు ఈక్రాప్ నమోదు పూర్తి చేశారు. మిగతా 96వేల34.49 ఎకరాలకు సంబంధించి రెండు మూడు రోజుల్లో పూర్తిచేస్తామని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి.

పారదర్శకంగా నమోదు



జిల్లా వ్యాప్తంగా ఈక్రాప్ నమోదు పారదర్శకంగా జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార బృందాలను పంటల సాగును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. కొన్ని చోట్ల డ్రోన్లను కూడా ఉపయోగిస్తాం. ఇప్పటివరకు 67.58 శాతం పూర్తయింది. మిగిలిన వివరాల నమోదును వేగవంతం చేశాం.

– ఎస్‌బీఎస్ నందు,
జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

క్లుప్తంగా

ఘనంగా పర్యాటక దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

అనంతగిరి: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌ వద్ద కార్మికులు పర్యాటక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్‌ మేనేజర్‌ బద్రీ, సూపర్‌వైజర్‌ సతీష్‌ ఆధ్వర్యంలోని కార్మికులు ట్రావెల్‌ఫర్‌ లైఫ్‌ ప్రతిజ్ఞ చేశారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లేటప్పుడు బాధ్యతయుతంగా వ్యవహరిస్తానని, వాటిపై ప్రతిజ్ఞ రూపంలోని వివరించారు. పర్యాటకశాఖ సిబ్బంది విజయ్‌, తదితరులు పాల్గొన్నారు. సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ వినియోగించకుండా పర్యాటకులకు అవగాహన కల్పిస్తామన్నారు.

లక్కొండలో ఫ్యామిలీ డాక్టర్‌ సేవలు



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

గంగవరం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి భావన ఆధ్వర్యంలో లక్కొండ గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్‌ వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మహిళలకు, వృద్ధులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి భావన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. పెదగార్లపాడు గ్రామంలో అక్టోబర్‌ 6వ తేదీన నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌వి విజయలక్ష్మి, సచివాలయం ఏఎన్‌ఎం పోతురాజమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

3న స్పోర్ట్స్‌ అకాడమీకి ఎంపికలు

విశాఖ స్పోర్ట్స్‌ : రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్‌) ఇంటిగ్రేటెడ్‌ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ అకాడమీలో ప్రవేశాలకు జిల్లా స్థాయిలో ఈ నెల 3 నుంచి ఎంపికలు నిర్వహించనున్నారు. పులివెందులలోని అకాడమీలో 30 మంది బాలురకు ప్రవేశం కల్పించనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికలు అక్టోబర్‌ 10 నుంచి జరగనుండగా... బ్యాడ్మింటన్‌, బాస్కెట్‌ బాల్‌, టెన్నిస్‌, వాలీబాల్‌, హాకీ జిల్లా ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ క్రీడాంశాల్లో మోటార్‌ ఎబిలిటీ టెస్ట్‌ అక్టోబర్‌ 3న పోలీస్‌ బ్యారెక్స్‌ గ్రౌండ్స్‌లో, స్కిల్‌ టెస్ట్‌ 4న ఏయూ గ్రౌండ్స్‌లో, 5న బుల్లయ్య కళాశాలలో ఉంటుంది. 12 నుంచి 18 ఏళ్ల వయసున్న వారు జాతీయ క్రీడా సమాఖ్య నిర్వహించిన సబ్‌ జూనియర్‌, జూనియర్‌ విభాగాల్లో పాల్గొని తొలి 8 స్థానాల్లో నిలిస్తే ప్రాధాన్యముంటుంది. మరిన్ని వివరాలకు స్వర్ణభారతి ఇండోర్‌ స్టేడియంలోని అధికారులను 0891 2705392లో సంప్రదించవచ్చు.

క్రీడాకారులకు అభినందనలు

- రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన గిరిజన విద్యార్థులు
- జాతీయస్థాయి పోటీలకు ఎంపికపై హర్షం



రెజ్లింగ్‌ పోటీల్లో సత్తా చాటిన గిరిజన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌

పాడేరు రూరల్‌ : ఎన్టీఆర్‌ కృష్ణా జిల్లాలో ఈనెల 21 నుంచి 23వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో ఎస్‌ఎఫ్‌సీ క్రీడల్లో పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో కొయ్యూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న రెజ్లింగ్‌ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 25 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 20 మంది పతాకాలు సాధించారు. వీరిలో 14 మంది అక్టోబర్‌ 3 నుంచి 10వరకు భోపాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాడేరు పట్టణంలోని తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న అథ్లెటిక్‌ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి వంతాల సింహాచలం నాయుడు ఈనెల 21 నుండి 23 వరకు గుంటూరు నాగర్జున యూనివర్సిటీలో నిర్వహించిన పోటిల్లో డిస్క్‌త్రో విభాగంలో బంగారు పతాకం, షాట్‌పుట్‌లో వెండి పతాకం సాధించాడు. అక్టోబర్‌ 14 నుండి 17 వరకు తెలంగాణలో జరిగే జాతీయ అథ్లెటిక్‌ పోటిల్లో అర్హత సాధించాడు. వీరిని బుదవారం పాడేరు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ అభినంధించారు, జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనభరిచి అల్లూరి జిల్లాకు మరింత గుర్తింపు తేవాలని ఆకాక్షించారు. జిల్లా స్పోర్ట్స్‌ కో ఆర్డినేటర్‌ ఎస్‌. సింహాచలం, అథ్లెటిక్‌ కోచ్‌ మన్మధరావు, రెజ్లింగ్‌ కోచ్‌ రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్‌: విజయవాడ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 21 నుంచి 23 నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీల్లో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్‌ భరత్‌కుమార్‌ నాయక్‌ చెప్పారు. పరుగు పందెంలో శెట్టి లోహిత్‌, మొదటి స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు సాధించారు. లాంగ్‌జంప్‌లో గోపాలకృష్ణ ప్రథమస్థానంలో నిలిచారు. వరంగల్‌లో త్వరలో నిర్వహించనున్న పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ మేరకు అరకులోయని డిగ్రీ కాలేజీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను అభినందించారు.

పీడీ అప్పారావు, అధ్యాపకులు తదితరులున్నారు. మండల కేంద్రం ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థిని కిల్లో ధనలక్ష్మి గుంటూరు ఆచార్య నాగర్జున యూనివర్సిటిలో ఈనెల 19 నుండి 23 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్‌ పోటీలో రెండో స్థానంలో నిలిచిన మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌ రామకృష్ణ, బాలుర డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌ భరత్‌కుమార్‌ నాయకు తదితరులు అభినందించారు. వరంగల్‌లో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్‌ పోటీల్లో ధనలక్ష్మి పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ చటపతిరావు, వార్డెన్‌ విజయ, పీడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: హైదరాబాద్‌లో ఈ నెల 24న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్‌ స్టేడియంలో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జి.మాడుగుల, పాడేరు మండలాలకు చెందిన గోల్డ్‌, సిల్వర్‌ మెడల్స్‌ సాధించినట్లు బుధవారం విలేకరులకు జి.మాడుగుల మండలం గొడుగుమామిడి గ్రామానికి చెందిన కరాటే కోచ్‌ ఎస్‌.రాజేశ్వరావు తెలిపారు. పాడేరు తలారిసింగి ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జి.మణికంఠ, ఎస్‌.చంద్రశేఖర్‌, కె.ధనేష్‌లకు గోల్డ్‌ మెడల్స్‌, శ్రీ గౌతమి పాఠశాలకు చెందిన మాలి భవీష్‌ గోల్డ్‌ మెడల్‌, జి.మాడుగుల కెజీబీవీకి చెందిన విద్యార్థినులు డి.ప్రమీలారాణి, ఎస్‌.రమ్య, పి.ప్రవల్లిక, కె గోవిందమ్మ, ఎస్‌ కృపా, ఎస్‌ ధనలక్ష్మిలు గోల్డ్‌, సిల్వర్‌ మెడల్స్‌, గొడుగుమామిడి ఎంపీపీ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్‌.రక్షిత గోల్డ్‌ మెడల్స్‌ సాధించినట్లు ఆయన తెలిపారు. పాడేరు ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎస్‌.ఉమమాహేష్‌, ఎం.కవిరాజ్‌, వి.సత్తిబాబు సిల్వర్‌ మెడల్స్‌ సాధించినట్లు చెప్పారు. విజేతలకు సుమన్‌ తదితరులు విజేతలకు మెడల్స్‌, ప్రశంసాపత్రాలు అందజేసినట్టు తెలిపారు.

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు వాలీబాల్‌, త్రోబాల్‌ పోటీల్లో ప్రతిభను, క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం రూన్సీహేన్సన్‌ తెలిపారు. స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో అనపర్తిలో ఇటీవల జరిగిన వాలీబాల్‌, త్రో బాల్‌ పోటీల్లో విశేషమైన ప్రతిభను చాటారన్నారు.

పాఠశాలకు చెందిన కోండ్ల మౌనిక, కొండ్ల ఆదిలక్ష్మి, పీరు నాగతులసి, పి.కావ్య ఉదయభాను, కె.భవాని, టి.రాజేశ్వరి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయా క్రీడాకారులను హెచ్‌ఎం రూన్సీహేన్సన్‌ , డిప్యూటీవార్డెన్‌ బి.లక్ష్మీకాంతం అభినందించారు. ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్‌ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్‌ కలుముల అక్కమ్మ అభినందనలు తెలిపారు



పతకాలు సాధించిన క్రీడాకారులతో ప్రిన్సిపాల్‌ భరత్‌కుమార్‌నాయక్‌, సిబ్బంది



విద్యార్థిని కిల్లో ధనలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు రామకృష్ణ, భరత్‌కుమార్‌ నాయక్‌



పోటీల్లో పొందిన పతకాలతో జి.మాడుగుల మండల క్రీడాకారులు

తాగునీటి పథకం ప్రారంభం

హుకుంపేట: మండలంలోని చీకుమద్దుల, గన్నేరుపుట్టు పంచాయితీల్లో 15 గ్రామాలకు ఏకలవ్య ఫౌండేషన్‌, కంటైనర్‌ కార్పోరేషన్‌ ఆఫ్‌ ఇండియ సహకారంతో తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గన్నేరుపుట్టులో నిర్మించిన తాగునీటి పథకానికి ఎస్‌బీఐ రీజనల్‌ మేనేజర్‌(విశాఖపట్నం) ఫణి కొండలరావు, రిటైర్డ్‌ జీసీసీ డీఎం కురుసా పార్వతమ్మలు ముఖ్య అతిథులుగా పాల్గొని బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతు గిరిజన గ్రామాల్లో తాగునీటి కల్పన కోసం ఆయా ఈ సంస్థలు పథకాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుమూల ప్రాంతల్లో ఏకలవ్య సంస్థ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించడం సంతోషకరమన్నారు. మరింత విస్తరించి గిరిజనులకు మంచిసేవలు అందించాలని వారు సంస్థ ప్రతినిధులకు కోరారు. అనంతరం పంచాయతీలోని 12 గ్రామల యువకులకు వాలీబాల్‌ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఎస్‌బీఐ పాడేరు బీఎం కిశోర్‌కుమార్‌, చీఫ్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌, ఫౌండేషన్‌ ప్రతినిధులు రమేష్‌, సతీష్‌, వెంకటరావు, నాగేశ్వరరావు, సర్పంచ్‌లు బొంజన్న దొర, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్‌కు మూడు మండలాలు

రంపచోడవరం: నీతి ఆయోగ్‌ పథకానికి జిల్లాలో వై.రామవరం,మారేడుమిల్లి, గంగవరం మండలాలు ఎంపికైనట్టు స్త్రీశిశు సంక్షేమశాఖ కమిషనర్‌ జానకి తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆమె ఈ విషయాన్ని తెలిపారు. ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ సూర్యలక్ష్మి, సీడీపీవోలు ప్రసన్న లక్ష్మి సంధ్యారాణి. సిహెచ్‌ లక్ష్మి పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

రంపచోడవరం: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధులకు నిర్దేశించిన సమయానికి హాజరు కావాలని డీఎల్‌పీవో రాఘవన్‌ తెలిపారు. ఉదయం 10.30 లోపు హాజరు నమోదు చేసుకోవాలని, సాయంత్రం ఐదు గంటల తరువాత మాత్రమే హాజరు నమోదు చేయాలన్నారు. రంపచోడవరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ ఆదేశానుసారం సకాలములో విధులకు హాజరు కాని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎవరైనా 15 రోజులు మించి సెలవులో వెళ్లాలనుకుంటే కలెక్టర్‌ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మూడు అలస్యపు హాజరును ఆకస్మిక సెలవుగా పరిగణించి జీతాలు మినహాయింపు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. నో వర్క్‌, నో పే విధానము ఇక నుంచి అమలు చేయుట జరుగుతుందన్నారు. కార్యదర్శులు ఉన్నతాధికారుల అనుమతితో సెలవు తీసుకోవాని, లేకుంటే జీతాలు నిలుపుదల చేస్తామన్నారు. షెడ్యూల్‌ ప్రకారం అక్టోబరు 2 నుంచి గ్రామసభలు నిర్వహించాలన్నార. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి క్లాప్‌ మిత్రలకు జీతాలను శనివారం లోగా చెల్లించాలని ఆదేశించారు. జనన, మరణ ధ్రువపత్రాలను వెంటనే జారీ చేసి నివేదికలు సమర్పించాలన్నారు. ప్రాపర్టీ రిజిష్టర్‌ ఎంత మొత్తం పన్నులు పెంచారో ఇకపై కలెక్టర్‌ సమీక్షిస్తారని, ప్రగతి నివేదికలు ప్రతి శనివారం సమర్పించాలన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.01 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 35 రోజులకి రూ.2.01 కోట్లు వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్‌.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై బుధవారం హుండీల ఆదాయం లెక్కించారు. నగదుతోపాటు 136 గ్రాముల బంగారం, 15.250 కిలోల వెండి లభించాయి.

శ్రీవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి వెంకటరమణ



శ్రీవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ దుప్పల వెంకట రమణ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామిని బుధవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. శ్రీవారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. టీటీడీ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వాదం అందజేశారు.

ఘనంగా కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్‌ కట్‌ చేస్తున్న మారిటైం బోర్డు చైర్మన్‌ కాయల వెంకటరెడ్డి

సీతమ్మధార (విశాఖ ఉత్తర): రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్‌ కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సీతమ్మధార ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి ఎదురుగా గల కేవీఆర్‌ ఎస్టేట్‌ భవనంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సిబ్బంది, కుటుంబ సభ్యుల మధ్య ఆయన కేక్‌ కట్‌ చేశారు. కేవీఆర్‌ సోదరుడు, కేవీఆర్‌ ఎస్టేట్‌ మేనేజింగ్‌ పార్టనర్‌ కాయల సూరారెడ్డి, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్‌క్యాప్‌ చైర్మన్‌ కేకేరాజు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్‌, వీకేపీపీఐఆర్‌ చైర్‌పర్సన్‌ చొక్కాకుల లక్ష్మి, వార్డు ఇన్‌చార్జి కర్రి మురళీ కృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు కాయల వెంకటరెడ్డిని గజామాలలతో సత్కరించారు. తన కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాను ప్రజల మనిషినని, జగనన్న మనిషినని అభిమానులకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

సంగీత అనుబంధ రంగాల్లో ఉపాధి

- సంగీత దర్శకుడు, సౌండ్‌ ఇంజినీర్‌, గాయకుడు సన్నీ ఎం.ఆర్‌
- ఏయూలో ఆడియో ల్యాబ్‌, వీడియో ఎడిటింగ్‌ స్టూడియో, కంప్యూటర్‌ ల్యాబ్‌ ప్రారంభం

ఏయూ క్యాంపస్‌: ఆడియో, వీడియో సంబంధిత కోర్సులు అందిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం తన ప్రత్యేకతను నిలుపుకుంటోందని ప్రముఖ సంగీత దర్శకుడు, సౌండ్‌ ఇంజినీర్‌, గాయకుడు సన్నీ ఎం.ఆర్‌ అన్నారు. బుధవారం ఉదయం ఏయూలోని ఏయూ - సెయింట్‌ లూక్స్‌ ఆడియో ఇంజినీరింగ్‌ మ్యూజిక్‌ ప్రొడక్షన్‌ కేంద్రం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆడియో ల్యాబ్‌, వీడియో ఎడిటింగ్‌ స్టూడియో, కంప్యూటర్‌ ల్యాబ్‌ను ఏయూ రెక్టార్‌ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్‌ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సన్నీ మాట్లాడుతూ సంగీతానికి సంబంధించిన అనుబంధ రంగాలు ఎంతగానో అభివృద్ధి సా ధిస్తున్నాయన్నారు. ఈ రంగంలో రాణించాలనుకునే యువతకు ఆంధ్ర విశ్వవిద్యాలయం- సెయింట్‌ లూక్‌ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అధునాతన రికార్డింగ్‌ స్టూడియో, ల్యాబ్‌లో అందించే శిక్షణ ఎంతో ఉపయోగంగా నిలుస్తుందన్నారు. మీడియా, చలనచిత్ర రంగాలు ఎంతగానో అభివృద్ధి చెందడంతో యువతకు ఉపాధి అవకాశాలు వి స్తృతమవుతున్నాయని చెప్పారు. ఏయూ రిజిస్ట్రార్‌ ఆచార్య వి.కృష్ణమోహన్‌ మాట్లాడుతూ వీడియో ఎడిటింగ్‌, సౌండ్‌ ఇంజినీరింగ్‌కు సంబంధించిన కోర్సులు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆధునిక లేబొరేటరీ, స్టూడియో ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రత్యక్షంగా శిక్షణ అందిస్తూ ఈ రంగంలో వారిని నిపుణులుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సంగీత దర్శకులు ఏయూ - సెయింట్‌ లూక్స్‌ ఆడియో ఇంజినీరింగ్‌, మ్యూజిక్‌ ప్రొడక్షన్‌ కేంద్రం నిర్వాహకులు ఆశీర్వాద్‌ లూక్‌ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన సహకారంతో ప్రపంచ స్థా యి రికార్డింగ్‌, ఎడిటింగ్‌ స్టూడియో సదుపాయాలు ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. ఏయూ రెక్టార్‌ ఆచార్య కె.సమత మాట్లాడారు.

రాష్ట్ర కౌన్సిల్‌ సమావేశానికి తరలిరావాలి

గంగవరం: విజయవాడలో అక్టోబర్‌ 1న నిర్వహించనున్న రాష్ట్ర రెవెన్యూ కౌన్సిల్‌ సమావేశానికి సిబ్బంది అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రెవెన్యూ సర్వీసెస్‌ అసోసియేషన్‌ గౌరవ అధ్యక్షుడు, తహసీల్దార్‌ శ్రీమన్నారాయణ, రంపచోడవరం డివిజన్‌ ఏపీఆర్‌ఎస్‌ఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌.మెహబూబ్‌ పాషా(అక్ర మ్‌), ఎస్‌.కె. ఫయాజ్‌ బాషా(జిలానీ) పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో వారు బుధవారం రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కౌన్సిల్‌ సమావేశాలకు జిల్లాలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులంతా ఐక్యతగా భారీగా తరలిరావాలని కోరారు. కౌన్సిల్‌ సమావేశాల్లో పాల్గొనేందుకు ప్రభుత్వానికి కోరగా, అనుమతులు జారీ చేసిందన్నారు. రంపచోడవరం డివిజన్‌లో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కౌన్సిల్‌ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వీఆర్వోలు వీఆర్‌ఏలు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

భలే భలే.. బెల్లం కుల్ఫీ

- ఆర్‌ఏఆర్‌ఎస్‌ శాస్త్రవేత్తల వినూత్న ప్రయోగం
- పోషక విలువలతో బెల్లం ఉత్పత్తులు
- మునగాకు రసం, తేనె, నిమ్మరసం జత చేసి పొడి తయారీ
- యూపీ, మహారాష్ట్రలకు దీటుగా ఎగుమతులు
- తేమ శాతం తగ్గించి నిల్వ సామర్థ్యం పెంచేలా కృషి



విదేశాలకు ఎగుమతి చేసే బెల్లం పొడి



సాక్షి, అనకాపల్లి: పంచదారతో పోలిస్తే బెల్లంలో పోషక విలువలు అధికంగా ఉంటాయి. ఔషధ గుణాలకు కొదవ ఉండదు. జీర్ణశక్తిని పెంచడం.. రక్తహీనతను తగ్గించడం వంటి సుగుణాలెన్నో పుష్కలంగా ఉంటాయి. అలాంటి బెల్లం ఎగుమతుల్లో దేశంలోనే అతి పెద్ద మార్కెట్‌గా అనకాపల్లి బెల్లం మార్కెట్‌ గుర్తింపు తెచ్చుకుంది. దేశంలో యూపీ, మహారాష్ట్రలకు దీటుగా అనకాపల్లి బెల్లం ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ ఘనతకు తమ ప్రయోగాలతో ఆర్‌ఏఆర్‌ఎస్‌ శాస్త్రవేత్తలు మరింత వన్నె తెస్తున్నారు. ఇప్పటికే ఘన బెల్లం, పొడి బెల్లం, లిక్విడ్‌ బెల్లం, బెల్లం జొన్న బిస్కెట్లు, బెల్లం ఓట్స్‌ బిస్కెట్లు, జెల్లీలు, చాక్లెట్లు, పల్లి చెక్కీలను రుచి చూపించిన అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌ శాస్త్రవేత్తలు సరికొత్తగా బెల్లం కుల్ఫీలను కూడా తయారుచేస్తున్నారు. ప్రస్తుతం బెల్లం పొడిని వివిధ రాష్ట్రాలకు పంపిస్తున్నారు. విదేశాలకు కూడా ఎగుమతి చేసే యోచనలో ఉన్నారు. గ్లూకోజ్‌, ఫ్రక్టోజ్‌, ఇతర లవణాలు, ప్రొటీన్ల వల్ల త్వరగా బూజు పట్టడం, నీరు కారటం జరుగుతుంది. ఇటువంటి కారణాల వల్ల బెల్లం నాణ్యత చెడిపోతుంది.

దీనిని నివారించేందుకు అనకాపల్లి చెరకు పరిశోధన స్థానం బెల్లాన్ని పొడి రూపంలో మార్చే సాంకేతికతను అభివృద్ధి చేసింది. అమెరికా, ఫిలిప్పీన్స్‌, కొలంబియా, ఇండోనేషియా దేశాల్లో డిమాండ్‌ ఉన్న తెల్లని బెల్లం పొడి, హెర్బల్‌, మూలిక, మునగ, తేనె, నిమ్మ బెల్లం పొడులను తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు.



అనకాపల్లి చెరకు పరిశోధన స్థానం

నిల్వ సామర్థ్యం పెంపొందించేలా..

బెల్లంలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంటుంది. బెల్లం ఉత్పత్తులే ఎగుమతి అవుతున్నాయి గానీ బెల్లం విదేశాలకు ఎక్కువస్థాయిలో వెళ్లడం లేదు. బెల్లంలో 12 నుంచి 13 శాతం వరకు తేమ ఉంటుంది. దాన్ని 3 శాతానికి తగ్గించి.. అదనంగా మునగాకు రసం, తేనె, నిమ్మ రసాలను వాటిలో సమృద్ధిగా కలిపి బెల్లం పొడి తయారు చేస్తున్నారు. చెరకు రసాన్ని స్థిరీకరించిన మోతాదులో స్ప్రే డ్రయింగ్‌ ద్వారా పొడి రూపంలో మార్చి బెల్లంలో తేమ శాతాన్ని తగ్గించి వాటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా కృషి చేస్తున్నారు.

కుల్ఫీలకు మంచి డిమాండ్‌



జీర్ణ సంబంధిత రుగ్మతలను నివారించేలా.. అత్యధిక పోషక విలువలు పెంచేలా బెల్లం కుల్ఫీలు తయారు చేస్తున్నాం. మా బెల్లం కుల్ఫీలకు ఆర్డర్లు పెరుగుతున్నాయి. చిక్కని పాలు, బాదం, జీడిపప్పు, పిస్తా, ఇలాచి, బెల్లం పొడితో తయారు చేస్తాం. మా దగ్గర ఆల్మండ్‌ కుల్ఫీ, జాగరీ కుల్ఫీ, జాగరీ పౌడర్‌ కుల్ఫీలకు బాగా డిమాండ్‌ ఉంది. వాటి నిల్వ సామర్థ్యం పెరిగేలా తయారు చేయడం జరిగింది. జీర్ణ సంబంధిత రోగులతోపాటు డయాబెటిస్‌ రోగులు కూడా ఈ కుల్ఫీలను ఆస్వాదించవచ్చు.

– పి.వి.కె.జగన్నాథరావు, ఆర్‌ఏఆర్‌ఎస్‌ అసిస్టెంట్‌ డైరెక్టర్‌



వివిధ రకాల బెల్లం ఉత్పత్తులు